క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టండి


నేలకూలిన విద్యుత్ స్తంభం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో గత మంగళవార రాత్రి గాలి, వానకు కూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని ఆర్.అనంతాపురం గ్రామంలోని వ్యవసాయ పొలాల్లోని బోరు మోటార్లకు విద్యుత్‌ను సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం నేలకూలింది. దీంతో గత నాలుగు రోజులుగా బోరుమోటార్లకు విద్యుత్ సరఫరా నిలిపోయింది. మరో వైపు పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. సమస్యను పరిష్కరించాలని విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదంటున్నారు. ఇప్పటికైన విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పశుదాణా పంపిణీ


రైతులకు పశుదాణా బస్తాలను పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి

ఏర్పేడు (రేణిగుంట): ఏర్పేడు పశువైద్యశాల వద్ద పాడిరైతులకు సబ్సిడీతో పశుదాణాను శనివారం మండల పశు వైద్యాధికారి శిల్పారెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పేరం ధనంజయులు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు 50 శాతం సబ్సిడీతో 50 కిలోల పశుదాణాను రూ.555కు అందజేశారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన లారీలు


హోటల్ పిట్టగోడను ఢీకొట్టిన లారీ


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గుంతలో దిగబడిన లారీ

బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ నుంచి శ్రీకాళహస్తి వైపు వెళ్తున్న ఓ లారీ డ్రైవర్ నిద్ర మత్తులో శ్రీకాళహస్తి నుంచి తడ వైపు వెళ్తున్న ఇంకో లారీని ఢీకొట్టాడు. దీంతో ఒక లారీ రహదారి పక్కన తవ్విన పైపులైన్ గుంతలో దిగబడింది. మరో లారీ రహదారి పక్కనే ఉన్న హోటల్ పిట్టగోడను ఢీకొని ఆగిపోయింది. అయితే హోటల్‌లో కష్టమర్లు ఉండగా, ప్రాణనష్టం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. లేకుంటే ప్రాణనష్టం జరిగేది. మరో లారీ ట్రాన్స్‌ఫార్మర్‌కు అడుగు దూరంలో, పైపులైన్ గుంతలో దిగబడింది. రెండు చోట్లా ప్రాణనష్టం తప్పడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

సారా తయారు చేస్తే జైలుకే


అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఏర్పేడు(రేణిగుంట): సారా తయారు చేసినా, విక్రయించినా జైలు శిక్ష తప్పదని తిరుపతి ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటిండెంట్ వాసుదేవచౌదరి హెచ్చరించారు. ఏర్పేడు మండలం ముసలిపేడు పంచాయతీ బత్తెనయ్య ఎస్టీ కాలనీలో శనివారం నవోదయం-2.0 కార్యక్రమంలో భాగంగా సారా నిర్మూలనపై అవగాహన కల్పించారు. సారా తాగడం వల్ల కలిగే దుష్పరిణామాలు, సారా తయారీతో పడే శిక్షల గురించి స్థానికులకు వివరించారు. అసాంఘిక కార్యక్రమాలకు ప్రజలు దూరంగా ఉండాలని కోరారు. శ్రీకాళహస్తి ఎక్సైజ్ సీఐ లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లులకు సన్మానం

రేణిగుంట: తల్లే దైవమని, మహిళలే కుటుంబ సర్వతోముఖాభివృద్ధికి దిక్సూచి వంటివారని రేణిగుంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమావతి అన్నారు. రేణిగుంట మండలం వెంకటాపురం సెక్టార్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లులను ఘనంగా సన్మానించారు. అలాగే ఏర్పేడు మండలం చెల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఇదే కార్యక్రమం నిర్వహించారు.


వెంకటాపురంలో తల్లులకు సన్మానం చేస్తున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది

రోడ్లేసి.. ఇరువైపులా వదిలేసి..

కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందాన.. సత్యవేడు నియోజకవర్గంలోని గ్రామాల్లో గుత్తేదారులు సీసీ రోడ్లను ఇష్టారీతిన వేస్తున్నారు. ఈ రోడ్లు గుత్తేదారులకు లబ్ధి చేకూర్చుకోవడానికే వేసుకున్నారా అనేలా వేశారు. ఎందుకంటే రోడ్లకు ఇరువైపులా బర్మ్స్ లేకుండానే వేస్తున్నారు. దీంతో పల్లెల్లో వాహనచోదకులు సీసీ రోడ్లకు బరమ్స్ లేకపోవడంతో అదుపు తప్పి కింద పడితే అంతే సంగతులు. సీసీరోడ్లు వేసేటప్పుడు కనీసం ఒకసారైనా పర్యవేక్షించాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. బిల్లులను మాత్రం గుత్తేదారుడికి ఆగమేఘాలపై చెల్లించి స్వామిభక్తిని చాటుకుంటున్నారు.



గోపాలరావుకాలనీలో రోడ్డుకు ఇరువైపులా బర్మ్స్ లేకుండా ఉన్న సీసీ రోడ్డు, వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ ప్రకాశం వీధిలో ఇలా..

- గ్రామాల్లో ఇష్టారీతిన సీసీ రోడ్ల నిర్మాణం
- రోడ్లకు ఇరువైపులా బర్మ్స్ లేకుండా వేసిన వైనం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- గుత్తేదారులకు ఆగమేఘాలపై బిల్లుల చెల్లింపు
- గ్రామీణ ప్రజలకు తప్పని నరకయాతన

వరదయ్యపాళెం: అధికారుల నామమాత్రపు పర్యవేక్షణ, గుత్తేదారులకు అధికార అహం.. వెరసి గ్రామీణ ప్రజల పాలిట శాపంగా మారుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లె పండుగ పేరుతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో సీసీ రహదారులు నిర్మించారు. ఆ రహదారులకు నాణ్యతా ప్రమాణాలు సైతం అంతంత మాత్రమే. అయితే రహదారులకు ఇరువైపులా గ్రావెల్ మట్టితో ఏర్పాటు చేయాల్సిన సైడ్ బర్మ్స్‌ను విస్మరించారు. పనులకు సైతం బిల్లులు జమ చేసుకున్నారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనదారులు ఆదమరచి పక్కకు దింపితే ప్రమాదానికి గురి కావాల్సిందే. అంతేకాక కిందకి దిగిన వాహనాన్ని రోడ్డుపైకి ఎక్కించేందుకు వాహనదారుల కష్టాలు అన్నీఇన్నీ కావు. ప్రధానంగా మేజర్ పంచాయతీల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. అక్కడ వాహనదారుల తాకిడి అధికంగా ఉండడంతో సమస్య మరింత తీవ్రం అవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

అనుకూలమైన ప్రాంతంలోనే నిర్మాణం..

గ్రామాల్లో వీధులు ఎత్తుపల్లాలుగా ఉంటాయి. అయితే నూతనంగా రోడ్డు వేసే సమయంలో ఆ ఎత్తుపల్లాలను జేసీబీతో చదును చేసి గ్రావెల్, కంకర దుమ్ముతో చదును చేసి వాటర్ క్యూరింగ్‌తో రోలర్ ద్వారా రోలింగ్ చేయాలి. అలా చదును చేసిన తర్వాతే సిమెంటు కాంక్రీట్‌తో రోడ్డు నిర్మాణం చేపట్టాలి. అయితే అందుకు విరుద్ధంగా చదునుగా ఉన్న ప్రాంతంలో కాంక్రీట్ సిమెంటు రోడ్డును అధికారులు లేని సమయంలో గుత్తేదారులు చకచకా పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. అధికారులు సైతం కూటమి ప్రభుత్వంలో నాయకుల ఒత్తిళ్ల కారణంగా చేసేదేమీ లేక ఎం బుక్‌లో రికార్డు చేసి బిల్లులు చెల్లిస్తున్నారు. ఉన్నతాధికారులు వీటిని ఒకసారి పరిశీలన చేస్తే పూర్తి వివరాలు వెలుగులోకి వస్తాయి.




వీకేఆర్‌వై కాలనీలో గ్రావెల్ బర్మ్స్ లేకుండా నిర్మించిన సీసీ రోడ్డు, వరదయ్యపాళెం హైస్కూల్ సమీపంలో సీసీ రోడ్డుకు సైడ్ బర్మ్స్ లేని దృశ్యం, గోపాలరావుకాలనీలో బర్మ్స్ లేకుండానే వేసిన సీసీరోడ్డు

పోలూరు జగన్నాథంకు సత్కారం


తిరుపతిలో ప్రజాకళావేదిక నుండి సత్కారం అందుకుంటున్న పోలూరు జగన్నాథం

వరదయ్యపాళెం: కనుమరుగవుతున్న జానపద గేయాలను మళ్లీ అందుబాటులోకి తెచ్చే విధంగా గేయాలను రూపొందిస్తున్న ఉపాధ్యాయుడు, కవి, జానపద కళాకారుడు పోలూరు జగన్నాథం కృషి అభినందనీయమని ప్రజాకళావేదిక అధ్యక్షుడు అరవ జయపాల్ అన్నారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర విద్యాలయం సెనేట్ హాల్‌లో మనపల్లె జానపదం జాతర కార్యక్రమంలో వరదయ్యపాళెంకు చెందిన ఉపాధ్యాయుడు జగన్నాథం తిరుపతి గంగమ్మ జాతర గురించి గానం చేసిన జానపద పాట శ్రోతలను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయనను ప్రజాకళావేదిక ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రంతో పాటు జ్ఞాపికను అందజేశారు. తన గేయానికి ఇంతలా ఆదరణ లభించడం పట్ల జగన్నాథం హర్షం వ్యక్తం చేశారు.

మహిళ అదృశ్యం


శ్యామలా దేవి

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం పెద్దసింగమాల గ్రామానికి చెందిన శ్యామలాదేవి(69) రెండు రోజుల క్రితం అదృశ్యమైంది. దీంతో కుటుంబ సభ్యులు తెలిసినవారి ఇళ్ల వద్ద, బంధువుల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో శనివారం శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసినవారు 9440900008 నంబర్‌కు తెలపాలన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు మణినాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, కూటమి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని మండలంలోని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనరు కొతననేని మణినాయుడు తెలిపారు. ఆయన శనివారం బుచ్చినాయుడుకండ్రిగలోని పార్టీ ఆఫీసులో మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలంతా ఐకమత్యంగా పని చేసి, పార్టీని మరింత బలోపేతానికి కృషి చేయాలన్నారు. సూపర్-6లో చెప్పిన పథకాలేమీ అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను చంద్రబాబు వంచిస్తున్నారని ఆరోపించారు. పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టేట్ గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి సాయినాయుడు, స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శి ఉగ్గుమూడి గురునాథం, నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్‌పాల్, గురవయ్య, కిరణ్‌యాదవ్, జయచంద్ర నాయుడు, వెంకటకృష్ణయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి


కార్మికులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు

నారాయణవనం: యువత మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు, సారాకు దూరంగా ఉండాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు తెలిపారు. శనివారం స్థానిక గణేష్ మోడరన్ రైస్ మిల్‌లో పనిచేస్తున్న కార్మికులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ మురళిమోహన్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకంతో మన శరీరంలోని కేంద్ర నాడీ మండలం పూర్తిగా దెబ్బతింటుందన్నారు. ఆరోగ్యం క్షీణించడం, సమాజంలో గుర్తింపు కోల్పోవడం జరుగుతుందని తెలిపారు. సారాను సేవిస్తే జీర్ణమండల వ్యవస్థ పూర్తిగా పాడై రోగాల పాలవుతారని హెచ్చరించారు. మాదక, మత్తు పదార్థాలకు, సారాకు దూరంగా ఉండాలని, కుటుంబాల గురించి ఆలోచించి, తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్ అందించాలని ఆయన సూచించారు. అనంతరం అందరితో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు అంజాద్ బాషా , శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణం

– నేటి నుంచి బ్రహ్మోత్సవాలు


సేనాపతి ఉత్సవంలో విశ్వక్సేనుడు

నారాయణవనం: పద్మావతీ సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు శనివారం సాయంత్రం సేనాపతి ఉత్సవంతో అంకురార్పణ చేశారు. ఉదయం నిత్యపూజాది కార్యక్రమాలను పూర్తి చేసి భక్తులను దర్శనానికి అనుమతించారు. సాయంత్రం స్థానిక భావనారుషి ఆలయం నుంచి ఊరేగింపుగా పద్మశాలీలు కొడిపార్వ వస్త్రాన్ని మేళతాళాలతో తీసుకువచ్చి ఆలయ అర్చకులకు సమర్పించారు. సేనాపతి ఉత్సవంలో భాగంగా మృత్యుంగ్రహణం , పుట్టమట్టిని పాలికలో నింపి నవధాన్యాలను మొలకెత్తించే కార్యక్రమాలను ప్రత్యేక హోమశాలలో చేపట్టారు. బ్రహ్మోత్సవాల్లో ఉత్సవర్ల ఊరేగింపు కొనసాగే వీధుల స్థితిగతుల పర్యవేక్షణకు విశ్వక్సేనుడు తిరుచ్చి వాహనంపై మాడవీధుల్లో విహరించారు.

నేడు ధ్వజారోహణం..

కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, నరసింహభట్టాచార్యులు మాట్లాడుతూ ఆదివారం వేకువ జామున 5.30 గంటలకు సుప్రభాత సేవ, నిత్య కైంకర్యాలు, 8.30 గంటలకు మాడవీధుల్లో దిక్పాలకులను బలి పీటాలలో ఆవాహనం అనంతరం 10.30 గంటల లోపు కర్కాటక లగ్నంలో గరుడాళ్వార్ చిత్రపటం ఉన్న వస్త్రాన్ని ధ్వజస్తంభానికి అధిరోహింపజేయడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయనిన్నారు. 12 గంటలకు ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న ఉత్సవర్లకు ఏకాంత స్నపన తిరుమంజనం, సాయంత్రం 5.30 నుంచి అరగంట పాటు స్వామివారి ఊంజల్‌సేవ నిర్వహిస్తామని తెలిపారు. రాత్రి 7 గంటలకే స్వామి వారు పెద్ద శేష వాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో ఊరేగింపుకు బయలుదేరుతారని అన్నారు.

ఏర్పాట్లు పూర్తి..

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి వెల్ల వేశారు. స్వామివారి వాహనాలకు రంగులు అద్ది, సిద్ధం చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఆలయంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేసి, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మాడవీధుల్లో విద్యుత్ దీపాల దేవతా కటౌట్లను ఏర్పాటు చేశారు. ఆలయ రాజగోపురాన్ని రంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. చక్రస్నానం నిర్వహించే పద్మసరస్సును ఇంజినీరింగ్ శాఖ వారు సిద్ధం చేశారు. ఆలయాన్ని దర్శించుకునే భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు ఆయన అధికారి నాగరాజు తెలిపారు.

జాతరకు ఆటంకం కలగకుండా చూడండి

- శాంతిభద్రతలు పరిరక్షణకు చర్యలు తీసుకోండి
- డీఎస్పీకి బీపీఅగ్రహారం గ్రామస్తుల వినతి


డీఎస్పీని సన్మానిస్తున్న బీపీ అగ్రహారం వాసులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బీపీఅగ్రహారంలో ఏటా నిర్వహించే గంగమ్మ జాతరలో ఆనవాయితీగా కొనసాగే పూర్వపు ఆచారాలకు ఆటంకాలు లేకుండా చూడాలని డీఎస్పీ నరసింహమూర్తికి ఆ ప్రాంత వాసులు విన్నవించారు. ఈ మేరకు శనివారం వారు డీఎస్పీని కలిసి రాతపూర్వకంగా వినతిపత్రం అందించారు. ఈ నెల 13, 14 తేదీల్లో గంగమ్మ జాతర జరుగుతుందని, అయితే పూర్వకాలం నుంచి కూడా కొనసాగుతూ వస్తున్న సంప్రదాయాన్ని కొంతమంది అడ్డుకోవాలనే ప్రయత్నం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రశాంత వాతావరణంలో గంగ జాతర జరిగేలా చూడాలని, ఆచారాలకు భంగం కలగకుండా చూడాలని కోరారు. అలాగే జాతర సందర్భంగా ఎటువంటి వివాదాలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని విన్నవించారు. ఆ మేరకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డీఎస్పీ వారికి తెలిపారు. కార్యక్రమంలో గంగమ్మ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నివాళి


చిరంజీవికి నివాళులు అర్పిస్తున్న నేతలు

ఏర్పేడు (రేణిగుంట): ఏర్పేడులోని అశోక్ నగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చిరంజీవి మృతి చెందడంతో శనివారం పార్టీ మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో గాలి రవి, భాస్కరయ్య, శ్రీపతి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గరుత్మంతుడి విగ్రహ ప్రతిష్ట


ప్రతిష్టించిన గరుత్మంతుడి ప్రతిమ

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని వరదయ్యపాళెంలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరాలయంలో గరుత్మంతుడి విగ్రహ ప్రతిష్ట, బలిపీఠ పునఃస్థాపన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. శనివారం ఉదయం ఆలయంలో శ్రీవారి వాహనమైన గరుత్మంతుడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని వేద పండితులు మధుసూదన శర్మ, మోహనాచార్యులు, నిరంజనాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వేలా సుందరం ఆధ్వర్యంలో కలశ స్థాపన, కలశ పూజ, గణపతి హోమం, నవగ్రహ శాంతి హోమం, లక్ష్మీనారాయణ హోమం అనంతరం పూర్ణాహుతి చేపట్టారు. ఇటీవల ప్రమాదవశాత్తు కంటైనర్ లారీ ఆలయంలోనికి దూసుకు రావడంతో బలిపీఠం, గరుత్మంతుని విగ్రహం ధ్వంసమయ్యాయి. వాటి స్థానంలో నూతనంగా విగ్రహాలను పునఃప్రతిష్ఠించినట్లు ఆలయ ధర్మకర్త తెలిపారు. ఈ సందర్భంగా పవిత్ర కలశ జలాలతో స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ చిన్నా, ఉపసర్పంచ్ చంద్రబాబు, విశ్రాంత గ్రామీణ బ్యాంక్ మేనేజర్ బొప్పన మోహన మురళి, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ పన్నెం నిర్మల్ పాల్గొన్నారు.


శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

విద్యార్థులకు ప్రోత్సాహకాలు


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

ఏర్పేడు(రేణిగుంట): ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు శనివారం మండలంలోని పల్లం హైస్కూల్‌లో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అక్కుపల్లి సుబ్బయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.5000, రూ.3వేలు నగదు ప్రోత్సాహకాలు చొప్పున పంపిణీ చేశారు. ఈ విద్యార్థులకు ఐఆర్ఎస్ జయశేఖర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు అక్కుపల్లి వెంకట మహేష్ యాదవ్ చేస్తున్న సామాజిక కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో కావలి ఆర్టీఓ సుందరరావు, సురేష్, ఎంఈఓలు బాలయ్య, దయాకర్, హెచ్‌ఎం తీగల ఆనంద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శని త్రయోదశి

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా బాసిల్లుతున్న శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో శనివరం శనిత్రయోదశి ప్రదోష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం రోజు త్రయోదశి పర్వదినం రావడం విశేషం కావడంతో మహాశివునికి ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ శని త్రయోదశి ప్రదోష పూజలకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక సంఖ్యలో పాల్గొని ఓం నమశ్శివాయ శివ నామస్మరణాలతో ఆలయాన్ని మార్మోగించారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్ ఆలయంలోని నందీశ్వర స్వామికి శ్రీ వాల్మీకేశ్వర స్వామికి ఏకకాలంలో పూజలు నిర్వహించారు. ఈ ప్రదోష పూజలకు ప్రసాదాలు నింద్ర గ్రామానికి శ్రీనివాస మిల్క్ డైరీ ఎండీ వాసుదేవనాయుడు, వారి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. వారికి ఆలయ మర్యాదలతో దర్శన ఏర్పాట్లు చేసి ప్రసాదాలు అందించారు. ఆలయ కార్య నిర్వాహణ అధికారి లత, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ప్రదోష మండపంలో నందీశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు


శని త్రయోదశి పూజకు పాల్గొన్న భక్తులు

జీవనోపాధుల ప్రణాళిక తయారీపై అవగాహన


మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామంలోని మహిళ సమాఖ్య సభ్యులకు శనివారం 2025-2026 ఆర్థిక సంవత్సరంలో మహిళ సంఘాలు వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళిక తయారు చేయడంపై ఏపీఎం మునెయ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సభ్యురాలు 2025-26 సంవత్సరంలో సీఐఎఫ్, బ్యాంకు రుణం, స్త్రీనిధి, ఉన్నతితో పాటు పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, పీఎంఎంఎస్‌వై, ఇతర కార్పొరేషన్ రుణాలు, వ్యక్తిగత రుణాల గురించి సభ్యులతో చర్చించి ప్రణాళిక తయారు చేస్తామన్నారు. సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకులో పరపతిని పెంచుకోవాలన్నారు. గ్రామ సంఘం వారీగా సమావేశం ఏర్పాటు చేసి వారి ప్రణాళికను ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు వెంకటరత్నం, వీరజిన్నప్ప పాల్గొన్నారు.

రూ.60 కోట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం


హెచ్చరిక బోర్డు


ఆక్రమణకు ప్రయత్నిస్తున్న ప్రభుత్వ భూమి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఉన్న రూ.60 కోట్ల ప్రభుత్వ భూమిపై భూ బకాసురుల కన్ను పడింది. ప్రభుత్వ భూమి తనదంటూ కోర్టులో కేసు ఉందని, ఎవరైనా ప్రవేశిస్తే కోర్టు ధిక్కరణ కేసు వేస్తామని భూమిలో పెద్ద బోర్డు రాత్రికి రాత్రే ఏర్పాటు చేశారు. వివరాలిలా ఉన్నాయి. రేణిగుంట మండలం కొత్తపాలెం రెవెన్యూ గ్రామంలోని సర్వేనెంబర్ 99లో 5.33 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. రెవెన్యూ ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా ఉన్న ఈ స్థలంలో గురువారం రాత్రి కొంత మంది తమకు హైకోర్టు ఆర్డర్లు ఉన్నాయంటూ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఉండడంతో శుక్రవారం రాత్రి రేణిగుంట తహశీల్దార్ సురేష్ బాబు ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డును తొలగించారు. తిరిగి శనివారం తెల్లవారుజామున యథావిధిగా హెచ్చరిక బోర్డును పెట్టారు. తహసీల్దార్ ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకొని వెళ్లారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి కూతవేటు దూరంలో, పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి పక్కన ఉండడంతో ఎకరా రూ.10 కోట్లకు పైగా విలువ ఉంది. అంత విలువ ఉండడంతో భూమిని ఆక్రమించుకోవాలన్న దురుద్దేశంతో కొందరు బడా నాయకులు పన్నాగాలు పన్నుతున్నారు.

అది ముమ్మాటికీ ప్రభుత్వ భూమి

కొత్త పాళెం రెవెన్యూ గ్రామంలోని సర్వే నెంబర్ 99లో ప్రభుత్వ భూమి ఉంది. కొందరు ఆ భూమిలో హెచ్చరిక బోర్డు నాటినట్లు సమాచారం అందింది. మా సిబ్బంది వెళ్లి బోర్డును తొలగించారు. మళ్లీ యథావిధిగా బోర్డును పెట్టి ఉన్నారు. కోర్టుకు సంబంధించిన విషయం కాబట్టి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లాను. ఆ భూమి కచ్చితంగా ప్రభుత్వ భూమి. – సురేష్ బాబు, తహసీల్దార్ రేణిగుంట